# టాంకు దళము

భారతీయ సైన్యాలకు ముందుగానే వెళ్లుతున్నాయి. వారి పొట్టిటాంకుదళాలు. ఈ టాంకులను మరుగుజ్జుటాంకులు అంటారు కూడాను. ఆ టాంకులగర్భంలో నిండిఉన్నవారూ భారతీయ వీరులే.

ఆ ఇసుకమహాసముద్రంలో ఇసుకగుంటలు, ఇసుక కెరటాలు, వేడివేడి గాలిదుమారాలు, ఎండమావులూ తప్ప ఏ అందమూ ముందుటాంకును నడుపుకుపోతున్న రావుకు కనబడుటలేదు.

టాంకుకన్నులలోంచే అతడూ చూస్తూ, టాంకును నడుపుకుపోయే యంత్రాలను సవరిస్తూ, చుక్కానిచక్రాన్ని తిప్పుకుంటూ ముందుకు తీక్షణంగా సాగిపోతునాడు.

గంటన్నర కిందటి చిన్నచిన్న సంఘర్షణలో అతని రక్తము కెరటాలుల్లా పొంగిపోయింది. మహా క్రోధపూరిత మాగధ మహిషాన్ని నడిపే యముడులా తన టాంకును ఈ కందకంలోకి ఆ అడ్డతీగెల కట్టపైకి దుమికించాడు, ఎగిరించాడు, పరుగెత్తించాడు.

అతని కన్నులకప్పిన ఎర్రతెరలు ఆతనిమెదడునిండిన జ్వాలాస్ఫులింగాలు టాంకు నరనరాలికి కమ్ముకుపోయి ఆ టాంకే ప్రాణపూరిత భయంకరపిశాచమయింది.

టాంకులోఉన్న తనతోటి భారతవీరులు క్షణక్షణ మారణాగ్నిప్రయోగశతఘ్నికాలనుండి జర్మనులను చెండాడి వేటాడుతున్నారు.

ఆ టాంకుపై టాంకువిధ్వంసకాగ్ని గోళనిపాతము ఇం తైనా తగలదు. తగిలితే దూసుకుపోతుంది. ఛేదిస్తే చప్ప బడి మూల ఒదిగి కూర్చుంటుంది.

## 2

రావు యుద్ధంలో టాంకునాయకుడుగా జేరకముందు సహజ శాంతశీలుడు, మితభాషి, త్రిపాశీలి.

యుద్ధంఅంటే చాలా భయపడ్డాడు. ప్రాణాలకే వెరి చాడు. రహస్యంగా స్నేహితులను యుద్ధంలో చేరవద్దని ప్రబో ధించాడు.

ఇంతలో ఒకనాటి "ఇండియన్ ఎక్స్ప్రెస్" పత్రి కలో జర్మనులు ఒక రష్యనుగ్రామంలో ఉన్న యావన్మంది స్త్రీ పురుషులను నాశనం చేశారు అని చదివాడు.

అతనికళ్లు మూతలుపడి, హృదయం వివశత్వంపొంది, ఆతని మెదడు రక్తం నిండింది.

స్టాలిన్ 'మీ యిళ్ళకు, మీ బిడ్డలకూ, మీ భార్యలకు జరిగేవిపత్తు ఆలోచించుకోండి. మీ దేశం మీాది కాకపోతుం దన్న భవిష్యత్తు ఆలోచించండి' అని రష్యన్ల ప్రబోధించడం చదివాడు.

ఏమిపుట్టిందో తల్లికి చెప్పకుండా— సైన్యాధికారో ద్యోగానికి దరఖాస్తు పెట్టినాడు. రాజముద్రాంకితోద్యోగము కొన్నిమాసాలలో వచ్చింది

మహా యుద్ధానికి శిక్షణ ఇచ్చినవారిలో ముందువాడయ్యాడు. టాంకునడుపుట, టాంకుయుద్ధము చేయుట, శతఘ్నుల నవలీలగా పేల్చుటలో అద్వితీయు డయ్యాడు.

ధీర లలితుడు, ధీరోదాత్తు డయ్యాడు.

## 3

లిబియాఎడారిలో భారతీయసైన్యాలు అవిరళపురోగమన వేగవంతాలై బ్రిటిషుసైన్యాలతోపాటు చొచ్చుకుపోతున్నవి.

రోమెలు సేనాని జర్మను దళాలను అనేకవ్యూహాలతో అనేక బంధాలతో రక్షించుకొంటూ నిలువనీడలేక వెనక్కుపరుగెత్తుకుని, పోతూ పోతూ ఎల్ అఘేలియా ప్రదేశంలో మోహరించాడు.

మూడురోజు లక్కడ ప్రచండయుద్ధం జరిగింది. శతఘ్నులపొగలు, ఇసుకపొగలు దిఙ్మండలంఅంతాకప్పాయి. ఎక్కడచూచినా కుప్పలుగా ఇనుపముళ్ళతీగలు అడ్డాలు. టాంకు విధ్వంసకగర్తరాలు, అడ్డాల కత్తెరబంధాలు.

రావుటాంకు ఎట్లు దాటిందో ఇవన్నీ. జర్మను వ్యూహామధ్యానికి వెళ్ళేటప్పటికి ఒక్కజర్మను లేడు. జర్మనులు ఇంకా తిరోగమనప్రదర్శనము నాటకమాడినారు.

# 4

ఎల్ అఫేలీ విజయయాత్ర సాగుతోనే రావు టాంకు లో చక్రంమీదకు వాలిపోయాడు.

ఇన్నాళ్ళనుంచీ చెక్కుచెదరని అతని ప్రేమనిధానమైన చిట్టిటాంకు దెబ్బతిన్నది. దూరాన్నుంచి ఒక జర్మనుగుండు వచ్చి పేలి, రావు టాంకుకు పార్శ్వంలో తాకి, చొచ్చి రావుకు కంఠంక్రింద తగిలి అతణ్ణి మూర్ఛాగతుణ్ణి చేసింది.

ప్రక్కనున్న సహాయ చోదకుడు రావును నెమ్మదిగా తప్పించి తా నా చక్రాన్ని ధరించాడు

దెబ్బతిన్న రావుచేతులు ఆ మైమరపులో ఏదో తిప్పుతూనే ఉన్నాయి.

తన టాంకునకు రావు "మహిషమర్దని" అని పేరు పెట్టుకొన్నాడు. మహిషమర్దని ఆగింది. రావును తాత్కాలిక వైద్య శిబిరానికి తీసుకువెడుతుంటే ఆమె కన్నుల నీరు వచ్చి నట్లు ఆమెగర్భంనుంచివచ్చిన ఇతర భారతీయయోధులకు కనిపించింది.

వైద్యనాయకుడు పరీక్షచేశాడు. కంఠంలోనుంచివెళ్ళిన తీక్ష్ణాగ్నిమయశకలము శుభ్రంగా ఆవలికిపోయింది ఒకటి రెండు చిన్న రక్తనాళాలు తెగినవి. రావు వారం రోజులలో మళ్ళీ యుద్ధానికి సిద్ధం అని అన్నాడు.

# 5

రావుకు ఆపరేషన్ జరిగినవెనుక స్వప్నలోకంలో విహారించే మత్తుతనంలో, వైద్యోపచారికైన ఒకఫ్రెంచి బాలిక అతడు ప్రేమతో "మహిష మర్దనీ" అని పిలచుట విన్నది.

ఆమె ఆశ్చర్యమందింది. ఎవ రా బాలిక అని ఆమె ప్రశ్నించుకొన్నది.

రావుకు మెలకువవచ్చింది. "నీనా" అన్న ఆ బాలిక రావుకు మహిషమర్దని పేరు తలపుకు తెస్తూ హాస్యంచేసింది.

"ఎవరయ్యా ఆ బాలిక? నీ ప్రియురాలా!"

"అవును. ఆమె కులాసాగాఉన్నదో, లేదో నామిత్రులు ఎవరూ చెప్పరు కారు!"

"ఏమీ ఉత్తరాలు రాలేదయ్యా?"

"ఉత్తరా లక్కరలేదు. మా స్నేహితులకు తెలుస్తుంది. నువ్వు ఆలోచిస్తావేమి?"

"ఏమీ లేదులే. నీపేరు ఇంగ్లండుకు పొగడుతూ పంపారటలే!"

"అయితే నీ అందమైనముఖంలో చిన్న అలలులాంటి ఆ ముడుతలు ఎందుకు?"

"మహిషమర్దని అంటే అర్థం ఏమిటి?"

"మహిషమర్దని అంటే, దున్నపోతుల చంపే తల్లి అని"

"నీ ప్రియురాలికి అంత భయంకరంపేరు ఎందుకూ?"

"అంత గొడవ ఎందుకులే. మీ ఊరు ఏది?"

"టునీషియా"

"నీ పేరు?"

"నీనా"

"ఎంత అందంగా ఉంది నీపేరుకూడా!"

"నీ ప్రియురాలికన్నా ఎక్కువ అందంగా ఉన్నానా?"

"నా ప్రియురాలు ఎవరని నీ ఉద్దేశం? అది నా టాంకు."

"టాంకు!"

"అవును."

ఆ బాలిక పకపక నవ్వింది. ఆమెవదనము ఆనంద కాంతితో పరిపుల్లమైంది.

"నేను నిజంగా భయపడ్డానురావ్" అని ఆమె అన్నది.

అతని కంతా అవగతమైంది. అతడు నవ్వుకొన్నాడు! ఆ శిబిరమంచముమీద పడుకొనియే ఆమె రెండుచేతులూ పట్టుకొని తన హృదయాని కదుముకొనినాడు!

బయట వైద్యముచేయబడుతున్న మహిషమర్దని నిశ్శబ్ద గర్జనచేసి, సంతోషముతో నవ్వుకొన్నది.